


# మామూలు మనిషి

## వి. ఎల్. ఆర్.

డిప్రెషన్ ఇన్ బే ఆఫ్ బెంగాల్. సముద్ర కెరటాలు ఎగసి ఎగసి పడుతున్నాయ్. నీటి రంగులో మార్పు స్పష్టంగా కనిపిస్తూంది. ఈ సమయానికల్లా ఒడ్డు వైపు వస్తూ ఎన్నో జాలర్ల పడవలు కనిపించాల్సింది. కాని, తుఫాను హెచ్చరిక వలన సముద్రం ఖాళీగా ఉంది. ఖాళీ అంటే గుర్తు కొచ్చింది. ఆనందరావు ఇల్లు చూసి పెట్ట మన్నాడు. చదువుతున్న గ్రాహమ్ గ్రీన్ నవల "బ్రైటన్ రాక్" మడిచి రాకలో పెట్టి బెడ్‌రూమ్ లోకి వెళ్ళాను.

"రుక్కూ! కాఫీ కలిపి ఇచ్చేద్దూ —నే నలా వెళ్ళాలి" అన్నాను.

ఇంటి పనులన్నీ అయిన తరవాత మధ్యాహ్నం చిన్న కునుకు తీసి, సేద తీరడం మా ఆవిడ నిత్య కృత్యాలలో ఒకటి. పగలంతా ఏదో పనిలో గడిపి, రాత్రి కేవలం ఆరు గంటలే నిద్ర పోవడం కొన్నేళ్ళ నించి అయిన అలవాటు నాకు.

"ఏవండీ! మీరు తీరుబాటుగా ఉంటే చూద్దా మనుందండి. బ్యాంకులో ఉద్యోగం, పని వేళ లయిన తరవాత హాయిగా కడుపులో చల్ల కదలకుండా ఇంటి పట్టు నుంటారనుకుంటే ఎప్పుడూ ఏదో చదువుతూ, వ్రాస్తూ నోరు మెదపరు. కొంచెం తీరిక ఉంటే ఊరి వాళ్ళ కుపకారం..."

మా ఆవిడ చాలా అరుదుగా ఇచ్చే స్పీచ్, గొంతు లోనే తప్ప పదాల్లో మార్పు రాదు ఒకసారికి, మరో సారికి.

"నీ నిద్ర కోటా అయిపోయిం దనుకున్నాను. పోనీలేవే. అలా హోటల్‌లో తాగి వెళతాను'' అన్నాను.

"సర్లెండి. . ." సజెస్టివ్‌గా ఉండే ఆమె ముఖం లోని మార్పులు ఆమె చెప్పదలుచుకున్నది నాకు స్పష్టం చేస్తాయి. "అక్కడికి తిండి, నిద్ర అక్కర లేంది మీకే!" సంక్షిప్తంగా భావం ఇది.

"రుక్కూ, ఎలాగూ బజార్లోకి వెళ్ళాలి. ఏవైనా కావలిస్తే చెప్పు" అన్నాను, ఆమె వెంటే వంటిం ట్లోకి నడుస్తూ. ఆమెకు కొంచెంగా కోపం వచ్చినా, ఒడ్డున పడ్డ చేపలా గిలగిల లాడిపోతాను.

"చూడండి. గ్యాస్ మరి రెండు రోజుల కన్నా రాదు. గ్యాస్ వాడికి ఫోను చెయ్యండి'' అంది.

ఆంగ్లేయులు కొన్నాళ్ళు ఈ దేశాన్ని పరిపాలించా రనడానికి నిదర్శనం "గ్యాస్‌వాడు" వంటి పద ప్రయోగాలు. కొన్ని ఆంగ్ల పదాలను తెలుగు చెయబోతే తెలుగు భాషే అభాసు పాలవుతుంది.

"ఏవండీ! సన్‌కి దూరంగా వెళ్ళండి. ఆలోచన లతో నిండా నలభై ఏళ్ళు రాక మునుపే సగం జుత్తు ఊడిపోయి బట్ట తలయిపోయింది. మంచి తల కట్టుని మురిసి చేసుకున్నాను. ఆ సరదా ఎన్నాళ్ళో నిలవలేదు" అంది నా చెయ్యి పట్టుకుని దగ్గరకు తీసుకుంటూ.

మా ఆవిడ మాటల్లో ఎగతాళి, చేతల్లో ఆప్యాయత—అవే ఆమెలో నాకునచ్చిన ప్రెయిట్స్—నేను చేసుకున్న పుణ్యం. ఎంతోమంది స్త్రీలు నవలలు, కథలు వ్రాస్తున్నారు. మా ఆవిడ లాంటి కేరక్టర్ ఉండే ఉంటుంది ఏదో రచనలో.

"ఏవండీ!" నా గుండె మీది ఆమె తల ఎత్తి నా ముఖంలోకి చూస్తూ, "ఎన్నాళ్ళయిందండీ మనం సినిమా కెళ్ళి" అంది.

"రెండు రోజులు..."టక్కున జవాబు చెప్పాను—మంచి విద్యార్థిలా, హైస్కూల్ రోజులు గుర్తుకు తెచ్చుకుంటూ.

"సర్లెండి. మొన్న సినిమా కెళ్ళింది అక్క, బావ వచ్చారని. మనకు మనంగా మనమే వెళ్ళి ఎన్నాళ్ళయిందని!" ఉడుకుమోత్తనం కొట్టొచ్చినట్టు కనిపిస్తూంది.

మా ఆవిడతో ఎక్కువ సేపు మాట్లాడితే నేను కన్‌ఫ్యూజ్ అయిపోతాను.

"మంచి సినిమాలు లేవే. జయమాలిని డాన్సులు చూసి పరవశించే వయసు మనకు దాటి పోయిందే" అన్నాను నీరసంగా మొహం పెట్టి.

"అందుకే అనుకుంటాను — మీకిచ్చి నా గొంతు. . ."

ఆవిడ భావం సువిదితం, చిర పరిచితం. ఏవన్నా

# ప్రభాత ఫేరీ

- డాక్టర్ దాశరథి

నిశా సింహాసనానికి తానే
  నిజమైన వారసుణ్ణి అంటాడు జాబిల్లి;
పడవ ఉయ్యాలలో పవళించిన నేను
పాలకడలిలో బాలశౌరిని నేనే అంటాడు

నిద్ర నా శయ్యా సమీపానికి
నిమిషమైనా రానంటుంది—కలహాంతరిత!

అర్ధశతాబ్ది తన భుజాలమీద నన్ను
అవలీలగా మోసిన ఈ శతాబ్దం
ఇప్పుడెందుకో భారంగా భావిస్తోంది;
తనకు డెబ్బైయెనిమిదేళ్ళు వచ్చాయి
కనుక వార్ధక్య భారమా? లేక నాపై
అనాదరమా? అవజ్ఞా?

అసలు కాలానికి ముసలితన మేమిటి?
అరవై వేలేండ్ల ఏకధారా వర్షం వల్ల
అవని చల్లబడి (సూర్యశకలం కదా!)
అనేక జీవులకు ఆశ్రయి మయింది

నగ్ననిశ మహోన్మాదంతో తారా తీరంలో
నాట్యం చేస్తోంది వక్షోజాల బరువుతో;
ముహర్షుల వలె ఉన్న మహా తరువులకు
ముదంచిన మదవతిని చూచి మతి చలించింది!

నేను ఉషః కన్యా పాణి పీడనం చేసిన వాణ్ణి
దీన జన శ్రీణ హృదయాల చీకటికి పగవాణ్ణి
అందుకే—జాతి పతాకం ఎగరేసుకుంటూ
ముందుకు పోతున్నా ప్రభాత ఫేరీలు చూసుకుంటూ

---

భరించగలదు కాని, వయసు మళ్ళిపోతూందని హాస్యాని కన్నా భరించలేదు.

"నా ఈడు వాళ్ళకు కొందరి కింకా పెళ్ళేకాలేదు" ఆమె డైలాగ్సు స్టాక్‌లో ఒక సింపుల్ సెంటెన్స్.

"పెళ్ళవనంతవరకూ వయసు మళ్ళనట్టేనా" అంటాను నేను, కొనడమే కాని ఎన్నడూ వాడని ప్రెషర్ కుక్కర్ వైపు చూస్తూ.

నేను ప్రెషర్ కుక్కర్ వైపు చూస్తే చాలు, మా ఆవిడకి నస. ఆమె కదంటే ఎందుకో ఎలర్జీ. ఎంత వేగంగా వంట చెయ్యాల్సిన అవసరం ఉన్నా, ఆమె కుక్కర్ వైపు చూడకుండా గిన్నె, గిన్నె పెట్టి నిదానంగా వంటచేస్తూంది. అదే ఆమె ముచ్చట—అలవాటు.

నీళ్ళు పొంగుతున్నాయ్. కాఫీ పొడి వేసి నీళ్ళు జల్లి ప్లేటు మూత పెట్టింది.

"ఏవండీ! ఇల్లు చూసి పెట్టమని. . ."

"అదేనే—అందుకే ఇప్పుడీ ప్రయాణం. పదిళ్ళ పేరయ్య భుజంగం రమ్మన్నాడు. ఏవో కొన్ని ఖాళీ పోర్షన్లు అతనికి తెలుసుట" అన్నాను.

"అతనితో మీకు స్నేహం ఏమిటండీ? మంచి వాడు కాదని తెలిసిన వాళ్ళంటే విన్నాను" అంది.

"ఏం—వాడి కళ్ళు నీ మీదకూడా పడ్డాయా?" అన్నాను నవ్వుతూ.

"ఛీ—ఏం మాటలండీ. . ."

భుజంగం గురించి చాలా వదంతు లున్నాయ్. నాకూ ఈ మధ్యే తెలిసింది. ఈ ఊరు బ్రాంచికి ట్రాన్స్‌ఫర్ అయి రెండేళ్ళయింది. అతని మాటలు, పక్కనుంచి పోయే ఆడాళ్ళ ఒంపుసొంపులు వర్ణిస్తూ కళ్ళప్పగించి చూడటం—ఇవన్నీ చూసి మా సహోద్యోగులందరం ఆ వదంతులలో కొంత నిజం ఉండవచ్చని అనుకున్నాం. అయితే, ఇతరుల బలహీనతల నాసరాగా తీసుకుని కబుర్లతో కాలక్షేపం చెయ్యడం, పరనింద నాకు నచ్చని విషయాలు. బల హీనతల్లేని మనిషి అరుదన్నది నేనెప్పుడూ గుర్తుంచుకునే విషయాల్లో ఒకటి. అత నెలాంటి వాడైనా, మాట ఎంత దురుసైనా తోటి వారికి చేతనయిన సహాయం చెయ్యడానికి వెనుకాడడు. అతని వ్యక్తిగత జీవితం గురించి ఆలోచించకుండా అతనితో స్నేహంగానే ఉంటాను నేను. బతికుండగా ఎంతోమందిని మంచివాళ్ళం దీ లోకం. ఈ మధ్య పోయిన వాళ్ళలో "చెడు" గురించికూడా "బెస్ట్ సెల్లర్స్" ఉత్పత్తి అవుతున్న కలికాలం ఇది.

మా ఆవిడ కాఫీ గ్లాసు అందిస్తూ "పాప తల్లికి మేక్సీ కుట్టాలి. మూడు మీటర్లు మంచి బట్ట తీసుకురండి" అంది.

ఉన్న ఒక్క కూతురికిరకరకాలబట్టలు స్వయంగా మెషన్ మీద కుట్టి మురిసిపోతూ ఉంటుంది.

"సరే తెస్తా కాని జపాన్ నైలక్స్ చీరలు సూపర్ బజార్‌లో కొచ్చాయిట. నీ కోటి తెచ్చేదా" అన్నాను, ఆమె అడక్కపోవడమే తీసుకు రాకపోవడానికి కారణం అన్నట్టు. నాకు చీరల పేర్లు, నాణ్యత, ఎంపిక—ఏ బొందా తెలియదు. ఆ మధ్య ఎవరో అనుకుంటే విన్నాను—మా ఆవిణ్ణి ఇంప్రెస్ చేయడానికి ఇవ్వ డన్నాను.

"ఓహో! చీరల గురించి కూడా తెలుసుకోవడం ప్రారంభించారన్నమాట. దేశభక్తి, దేశీయ వస్తువుల మీది ప్రీతి మనకు స్వతంత్రం వచ్చిన తరవాత తగ్గిపోయినట్టుంది. . ."

ఆమె తండ్రి, నా మామగారు కాంగ్రెస్‌వాదిగా స్వతంత్ర సమరంలో పాల్గొని ఉన్న పదెకరాల బంగారం పండే భూమిని ఆ సమరాగ్నికి సమిధగా ధారపోసి, పైకి వచ్చే "తెలివితేటలు" లేక స్వాతంత్ర్యం వచ్చిన తరవాత కొడుకుల ఆర్జన మీద బతికి, ఆ కొడుకుల చేతుల మీదుగానే వెళ్ళిపోయిన దేశ భక్తుడు, అమాయకుడు. ఆయన దేశభక్తికి మా ఆవిడ వారసురాలు—అస్తి ఎలాగూ మిగల్చలేదు కాబట్టి.

"రుక్కూ! పొలిటికల్ సఫరర్‌గా మీ నాన్నకు ప్రభుత్వం ఏమీ భూమి ఇవ్వలేదా?" అన్నాను, తెలిసే గేలి చేద్దామని.

"స్వార్ధరహితంగా దేశం కోసం సర్వస్వం త్యాగం చేసిన మహనీయుడు నాన్న. జీవన విలువలు అంటే తెలియని మీ లాంటి. . ."

సంభాషణ ఈ ధోరణిలా పొడిగించడం నా ఆరోగ్యానికి మంచిది కాదు. మాట మార్చాను.

"మరి నే వెళతా కాని, ఎదురింటావిడతో వెళ్ళి నీ క్కావలసిన చీర కొనుక్కో" అన్నాను కాఫీ గ్లాసు డైనింగ్ టేబిల్ మీద పెడుతూ.

"ఆకాశం చూస్తే వర్షం వచ్చేలా ఉంది. ఎవరితోనో మాటల్లో పడి ఇల్లు, ఒళ్ళు మరిచి తిరగకండి." "ఒళ్ళు" అనేపదం నొక్కి పలుకుతూ అంది.

పైన వర్షం పడుతూంటే, ఇంట్లో ఆమె కౌగిట్లో వెచ్చగా. . .

నంబరు ఇరవై ఏడు బస్సెక్కి గవర్నర్ బంగ్లా దగ్గర దిగి "గ్యాసువాడి" దగ్గరికి వెళ్ళాను.

"వారం రోజులు పడుతుందండి" అన్నాడు, చికాగ్గా మొహం పెట్టి. అతన్ని చూస్తే జాలేసింది. వందల కొలది కస్టమర్స్‌కు చెప్పిన జవాబే చెప్పుతూ, వాళ్ళ కోపానికి గురవుతూ బతుకుతెరువుకు ఉద్యోగం చేస్తున్న మామూలు మనిషి. మనిషికి మనిషిగా గౌరవం లభించే రోజు ఎప్పుడొస్తుందో అని అనుకుని మనసులోనే నవ్వుకున్నాను.

గవర్నర్ బంగ్లా ముందు బస్సు కోసం నిల బడ్డాను. దగ్గరగా ఉన్న క్లబ్బులోకి కార్లు వెడుతున్నాయి. దేశ పురోభివృద్ధికి పరోక్షంగా తోడ్పడే కృషీవలులు, ఎన్నో సమస్యలతో, తలనొప్పులతో రోజంతా గడిపి, వాటన్నిటికి దూరంగా కొంతసేపు రిలాక్స్ అవుదామని "గుడి" కి వెళుతున్న ప్రయా